క్లుప్తంగా

రచయిత ఓల్గా మాతృమూర్తి సుబ్బమ్మకు ఘన నివాళి



యడ్లపాడు: ప్రముఖ స్త్రీవాద రచయిత్రి పోపూరి లలిత కుమారి (ఓల్గా) మాతృమూర్తి సుబ్బమ్మ సంస్మరణ సభ యడ్లపాడు పీఆర్ కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రచయిత్రి ఓల్గా, అక్కినేని కుటుంబరావు, న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, నారాయణ స్కూలు ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, పోపూరి ప్రసాద్, పోపూరి రవి మారుతి, ముత్తవరపు సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని లాయర్స్ స్ట్రీట్ -2 సచివాలయ పరిధిలోని 17వ వార్డులో సోమవారం వినుకొండ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. తిమ్మాయపాలెం రోడ్డులోని చౌడమ్మ గుడి వద్ద నుంచి సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొననున్నారు.

నాదెండ్లలో..

మండల కేంద్రమైన నాదెండ్ల రాజీవ్ కాలనీలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నేడు శావల్యాపురంలో జగనన్న సురక్ష

శావల్యాపురం: స్థానిక గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. గ్రామంలో 1300 ఇళ్లకు గానూ వలంటీర్లు 850 సర్వే చేశారన్నారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం 550 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీరందరికీ జగనన్న సురక్ష కార్యక్రమం శిబిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో ఉచితంగా అందజేస్తామని ఆయన తెలిపారు.

నాదెండ్లలో..

కనపర్రు గ్రామ సచివాలయంలో ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో అర్హులైన వారందరికీ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శావల్యాపురంలో తాగునీటి ఇక్కట్లు

శావల్యాపురం: అన్నీ ఉన్నా అల్లుడు నోటిలో శని చందంగా శావల్యాపురం గ్రామ పరిస్థితి ఉంది. అధికారుల నిర్లక్ష్యం.. రక్షిత మంచి నీటి చెరువుకు శాపంగా మారింది. మంచినీటి చెరువు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పైపులైను శిథిలావస్థకు చేరడంతో పాటు ఉన్న ఒక మోటారు తరుచూ మరమ్మతులకు గురవుతోంది. గ్రామంలో సూమారు 500 కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం మంచినీటి చెరువు నిర్వహణ పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో నడుస్తోంది. ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.100ను వలంటీర్ల ద్వారా వసూలు చేయాల్సి ఉండగా.. పూర్తి స్థాయిలో జరగడం లేదు. దీనికితోడు కొన్ని నెలల నుంచి నీళ్లు వదిలే వ్యక్తికి వేతనం ఇవ్వడం లేదు. సమస్యల్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా ఫలితం లేదు. గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మంచి నీటి చెరువు నిండుగా మూడు నెలలకు సరిపడా తాగునీరు ఉన్నా ... నీళ్లు వదిలే వ్యక్తికి వేతనం చెల్లించలేదని కారణంగా సరఫరా నిలుపుదల చేయడంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య దృష్టికి తీసుకెళ్లగా, సత్వరమే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సేవే పరమావధిగా వలంటీర్లు

వలంటీర్లకు వందనం





పక్షవాతంతో మంచంలో ఉన్న సామ్రాజ్యానికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ కృష్ణవేణి (ఫైల్)

నాపేరు తోకల వెంకట్రావు మాది ఉన్నవ గ్రామం. ఉన్నవ క్లస్టర్-2లో కృష్ణవేణి వలంటీర్‌గా పని చేస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి.. వాటిని పొందడానికి కావల్సిన అర్హతల్ని ఎప్పటికప్పుడు ఇంటికొచ్చి చెబుతుంది. అంతేకాదు.. మా నాయనమ్మ సామ్రాజ్యం మూడు నెలల కిందట పక్షవాతం వచ్చి మంచంలోనే ఉంటోంది. ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామున 6 గంటలకే ఇంటికొచ్చి పింఛన్ ఇస్తోంది. ప్రభుత్వ పథకాలు, గ్రామసభలు, సమావేశాలు గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తోంది.

– తోకల వెంకట్రావు, ఉన్నవ

ఇంతకంటే ఏం కావాలి ?



మా అమ్మమ్మ తాళ్లూరి కనకమ్మకు 97 సంవత్సరాలు. వృద్ధాప్యం వల్ల నడవలేక కొన్నాళ్లుగా మంచంలోనే ఉంటోంది. తుర్లపాడు గ్రామంలోని క్లస్టర్ -2 వలంటీర్‌గా పని చేస్తున్న అల్లడి సునీత ప్రతినెలా ఇంటికొచ్చి అమ్మమ్మను ప్రేమగా పలకరిస్తుంది.

వేలిముద్రలు పడకున్నా, సర్వర్ బిజీగా ఉన్నా విసుక్కోకుండా రెండు మూడు సార్లు ఇంటికి వచ్చి మర్చిపోకుండా ఒకటో తేదీ దాటకుండా పింఛన్ డబ్బులు ఇస్తోంది. మా కుటుంబ సభ్యులకు విద్యకు సంబంధించిన సర్టిఫికెట్ల కోసం సచివాలయంలో అర్జీ రాసి వాటిని ఇంటికి తెచ్చి ఇచ్చింది. ఒక వలంటీర్ నుంచి ఇంతకంటే ఏం సేవలు కావాలి.

– మేడిద అనిల్, తుర్లపాడు



కనకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సునీత (ఫైల్)

చంద్రబాబు మోసం చేస్తే ఆదుకున్నది సీఎం జగనే..

జగనన్న సురక్షలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మహిళకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయకుండా చంద్రబాబునాయుడు మోసం చేస్తే.. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ చేసి ఆదుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని 24వ వార్డు ప్రశాంతీనగర్ సచివాలయం ఆధ్వర్యంలో పాలపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో నిర్వహించిన ×జగనన్న సురక్ష×లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత నాలుగేళ్లలో సీఎం జగన్ డ్వాక్రా మహిళలకు రూ.26వేల కోట్ల రుణమాఫీ చేశారని తెలిపారు. తీసుకునే రుణాలపై వడ్డీశాతాన్ని 11 నుంచి ఏడు శాతాన్ని తగ్గించారని పేర్కొన్నారు. వార్డులోని లబ్ధిదార్లకు అమ్మఒడి పథకం ద్వారా రూ.86.25లక్షలు, చేదోడు ద్వారా 68మందికి రూ.10కోట్ల ప్రయోజనం చేకూరిందని వివరించారు. గతంలో 280మందికి పింఛన్లు ఇస్తే.. ఇప్పుడు 410మందికి ఇస్తున్నారని చెప్పారు. వార్డు మొత్తంపై గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.8.69కోట్లు అందజేయగా, రూ.2.51కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వలేదని, తమ ప్రభుత్వంలో 277మందికి ఇచ్చామని ఎమ్మెల్యే చెప్పారు. కుటుంబాలకు న్యాయం జరిగితేనే తనకు ఓటేయమని ధైర్యంగా చెప్పిన ఏకైక సీఎం జగన్ ఒక్కరేనని పేర్కొన్నారు. వార్డు పరిధిలోని బాలయ్యనగర్ ప్రాంతాన్ని పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి ప్రతి ఒక్కరికీ తాగునీరు, రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాల వసతి కల్పించామని పేర్కొన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమైనవని ఖండించారు. అతను చెబుతున్నట్లుగా 18వేలమంది ఆడపిల్లలు అదృశ్యమైతే రాష్ట్రం అల్లకల్లోలంగా మారేదన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన ఆగడాల్ని పవన్ ఏనాడు ప్రశ్నించలేదని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు, పిల్లల చదువులు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆదాయ, కుల, జనన, మరణ పత్రాలతో పాటుఉ ఇంటి పట్టాలు, రేషన్ కార్డు మంజూరు తదితర సర్టిఫికెట్లను పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షత వహించగా, గిరిజన, ముదిరాజు, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, ఈ.ఎం.స్వామి, కందుల ఎజ్రా, వార్డు నాయకులు సానికొమ్ము సుబ్బారెడ్డి, మారూరి శివారెడ్డి, కాకుమాను సదాశివరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, కుంకల గుంట శ్రీను, సుబ్బారావు, శివలీల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గుంటుపాలెంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం: అర్హత ఉండీ నేటికీ సంక్షేమ పథకాల లబ్ధి పొందని వారంతా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని గుంటుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దీర్ఘకాలంగా వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన సంక్షేమ పథకాల్ని అర్హులైన లబ్ధిదారులకు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. అనంతరం 518 మందికి ధ్రువీకరణ పత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పచ్చవ తేజస్విని, ఎంపీటీసీ సభ్యురాలు భీమని సుబ్బాయమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చవ శ్రీనివాసరావు, కావూరి మాబుసుభానయ్య, దారా మోషే, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎంఈఓ పుసులూరి లలితాకుమారి, ఈవోపీఆర్డీ పి.సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఏఈవో పురేటి అశోక, పంచాయతీ కార్యదర్శి కె.మహేంద్ర, వీఆర్వో వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ షాదీ తోఫాపై నూర్ బాషాల హర్షం

రొంపిచర్ల: పేద ముస్లింలతో పాటు దూదేకుల నూర్ బాషా ముస్లింలకు కూడా వైఎస్సార్ షాదీ తోఫా కింద వివాహం చేసుకుంటున్న దంపతులకు రూ.1 లక్ష ఇస్తూ జీవో ఇవ్వడంపై మండల నూర్ బాషా ముస్లిం దూదేకుల సంఘం ఆదివారం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది. మండలంలోని విప్పర్లలో రాష్ట్ర యువజన ప్రచార కార్యదర్శి కొటికలపూడి శ్రీను మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నూర్ బాషా సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో నూర్ బాషాలంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని కోరుకోవాలన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే నూర్ బాషాలు మరింత అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో దూదేకుల నూర్ బాషా సంఘం నాయకులు ఏల్చూరి మౌలాలీ, షేక్ సైదులు, షేక్ నూగూర్, కాశీం ఉన్నారు.

నేడు గణపవరం రామాలయంలో పూజలు

నాదెండ్ల: గణపవరంలో రూ.2.5 కోట్లతో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం ప్రతిష్ఠ జరిగి 41 రోజులు కావచ్చిన సందర్భంగా పలు పూజలు నిర్వహించనున్నారు. ఉదయం అభిషేకాలు, హోమాలు, సాయంత్రం స్వామికి 160 మంది దంపతులతో కల్యాణం, అనంతరం రాముల వారికి పట్టాభిషేకం నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపాఠశాల అధ్యాపకుడు, గోవిందరాజుల ఆలయం ప్రధాన పూజారి మాల్యవంతుని శ్రీనివాస దీక్షితులు బృందం ఆధ్వర్యంలో కల్యాణం కన్నుల పండువగా జరగనుంది. చినజీయర్ స్వామి శిష్యులైన కూర్మనాథ స్వామి, భారతీయ ధార్మిక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, కేతినేని శ్రీహరిరావు హాజరవుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చెట్లు నరికివేతపై తూతూమంత్రంగా ఫిర్యాదు



చెట్లు నరకడంతో బోసిపోతున్న ఆర్ అండ్ బీ రోడ్డు

రొంపిచర్ల: మొక్కలు పెంచండి.. పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదం మాటలకే పరిమితం అవుతోంది. పర్యావరణాన్ని కాపాడేందుకు చెట్ల పెంపకం ఒక్కటే ప్రధాన మార్గమని ప్రతి ఒక్కరికీ తెలుసు. మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం నుంచి స్వచ్ఛంద సంస్థలు సహా పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయితే, కొందరు స్వార్థపరులు, అక్రమార్కులు ప్రభుత్వ ఆధీనంలోని చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని విప్పర్ల పల్లి, మునమాక గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్లపై అక్రమార్కుల కన్నుపడింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం మిషనరీతో చెట్లను ముక్కలుగా చేసి ట్రాక్టర్లపై తరలించారు. సమాచారం తెలుసుకున్న సచివాలయం సిబ్బంది అక్కడకు వెళ్లి ప్రశ్నించగా ఆర్ అండ్ బీ అధికారులు అనుమతి ఇచ్చారని చెప్పారు. అనుమతి పత్రాలు చూపించమనడంతో వాదనకు దిగారు. ఇదే సమయంలో ఆర్ అండ్ బీ అధికారులకు సచివాలయం అధికారులు సమాచారం అందజేశారు. ఆ శాఖకు చెందిన ఏఈ ఆ ప్రాంతానికి చేరుకొని చెట్ల నరికివేతను నిలుపుదల చేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నరికిన కలపను ట్రాక్టర్లలో తరలించి వేశారు. అయితే, ఆ అధికారి కూడా తీరిగ్గా ఆదివారం రొంపిచర్ల పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికారని ఫిర్యాదు చేశారు. ఆర్ అండ్ బీ నిర్లక్ష్యంతోనే పచ్చని చెట్లు నరికారంటూ గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ



ఐరన్, కాల్షియం మాత్రలు, సిరప్ పంపిణీ చేస్తున్న డాక్టర్ కందిమళ్ల తేజస్విని, రోటరీ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్టు డాక్టర్ కందిమళ్ల తేజస్విని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో మాతాశిశు ఆరోగ్యంపై పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని తెలిపారు. గర్భిణి ఆరోగ్యంపైనే పుట్టే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా వైద్యుల్ని సంప్రదించడం, వారు సూచించిన మందులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. దీంతో పాటు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు కూడా తల్లిపాలతో పాటు వైద్య పట్టికలో సూచించిన విధంగా టీకాలు, ఇతర మందులు అందజేయాలని తెలిపారు. అనంతరం ఐరన్, కాల్షియం బిళ్లలు, టానిక్‌లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు మిన్నెకంటి కొండలరావు, తోటకూర వెంకటనారాయణ, కందిమళ్ల అంజిబాబు, తాళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

చర్మకారుల అభ్యున్నతికి సహకారం అభినందనీయం



సమావేశంలో మాట్లాడున్న రవికుమార్

శావల్యాపురం: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చర్మకారుల అభ్యున్నతి, ఉపాధి కోసం లెదర్ పార్క్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని వినుకొండ నియోజకవర్గ చర్మకారుల సంఘం అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లాపరపు రవికుమార్ తెలిపారు. మండలంలోని కారుమంచి ఎస్సీ కాలనీలోని చర్మకారుల సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా రూ. 65 కోట్లను చర్మకారుల అభ్యున్నతికి కేటాయించడం అభిందనీయనీయమన్నారు. వినుకొండ నియోజకవర్గంలో చర్మకారులు, డప్పు కళాకారులకు రూ. లక్ష చొప్పున రుణం మంజూరు చేసి వారి జీవనోపాధులు పెంపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో చర్మకారుల సంఘం మండల అధ్యక్షుడు జుంజు యోహాను, సభ్యులు దారా ఆశీర్వాదం, మల్లాపరపు రామయ్య, అంజమ్మ, మరియమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణం

శావల్యాపురం: మండలంలోని కారుమంచిలో రూ.2 కోట్లతో శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరీస్వామి దేవాలయ పునర్నిర్మాణం శరవేగంగా జరుగుతున్నట్లు ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. గ్రామస్తులు, దాతలు సహకారంతో రూ. 33 లక్షలు సేకరించామని, ప్రభుత్వం మరో కోటి రూపాయలు మంజూరు చేసిందని చెప్పారు. మొదట విడతలో రూ.33.60లక్షలను విడుదల చేసిందని తెలిపారు. నూతన దేవాలయ నిర్మాణంలో భాగస్వాములయ్యే దాతలు కమిటీ సభ్యుల్ని సంప్రదించాలని కోరారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఇడపలపాటి హనుమంతరావు, అప్పలనేని వీరాంజనేయులు ఉన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో సమితి సభ్యులు

చిలకలూరిపేట: భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కటికం సైదారావు తెలిపారు. ఆషాఢ మాసం గురు పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని పురుషోత్తమపట్నంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడే మనిషి రూపంలో జన్మిస్తే ఆయన్ను మాత్రమే గురువుగా భావించాలని త్రైత సిద్ధాంతం తెలుపుతోందన్నారు. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండటం వల్ల గురు పౌర్ణమిగా నిర్ణయించి, సాక్షాత్తు శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి గురు పూజ చేయాలని చెప్పారు. సమితి సభ్యులు కె. అరుణ, కె. కోటేశ్వరరావు, కె. నారాయణమ్మ, గోపి, వీరయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ముగ్గురికి గాయాలు

యడ్లపాడు: జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. యడ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన కట్టా వీరయ్య ఆదివారం ఉప్పువాగు వద్ద పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నడానికి వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం అదే కాలనీకి చెందిన బత్తుల యేబు, కత్తి మరియదాసును ఎక్కించుకుని ఇంటికి బయలుదేరాడు. ఎత్తిపోతల పథకం గది ముందుగా ఎత్తులో ఉన్న జాతీయ రహదారి పైకి ట్రాక్టర్ ఎక్కే క్రమంలో ద్విచక్ర వాహనం అడ్డు వచ్చింది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లోకి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని ఆటోలో కాటూరి వైద్యశాలకు తరలించారు.

శాకంబరిగా శ్రీ మహంకాళీ మాత



నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకొని ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళీ అమ్మవారికి శాకంబరి అలంకరణ, విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ఆషాఢ సారెలు, పొంగళ్లు సమర్పించారు. ఆలయంలో చండీ హోమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా భక్తులు విరాళాలు అందివ్వాలని ఈఓ టి.సుధాకరరెడ్డి కోరారు.

కిసాన్ క్రెడిట్ కార్డులతో పాడి రైతులు ఆర్థిక ప్రగతి సాధించాలి

శావల్యాపురం: పాడి రైతులు కిసాన్ క్రెడిట్ కార్డుల్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని నరసరావుపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డి.నరసింహులు ఆదివారం సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడి గేదెలు, జీవాలు, గొర్రెల నిర్వహణ నిమిత్తం ఒక్కో రైతుకు రూ. 30 వేల నుంచి రూ.1.60లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీని ప్రభుత్వమే కల్పిస్తుందని చెప్పారు. జిల్లాలో 22,115 మంది పాడి రైతులకు గానూ శావల్యాపురం మండలంలో 1300 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల్ని ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి గేదెలకు రాయితీ మినహాయించి మిశ్రమ దాణాను కేజీ 6.50 పైసలకు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇందుకుగాను జిల్లాలో 600 మెట్రిక్ టన్నుల దాణాను సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. జొన్న రకం గడ్డి విత్తనాల 5 కేజీల సంచిని రాయితీ మినహాయించి రూ.115కే సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. పశు వైద్యశాలల్లో మందుల కొరత లేదని తెలిపారు.